


# విభారె
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 11-11-2023 సంపుటి : 06 సంచిక : 68 పేజీలు : 8 వెల : రూ 3-00

# సృజనాత్మకత ప్రేమించండి.. స్థానికతను ప్రోత్సహించండి..

## దేశ ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు



దీపావళి అంటే దీపాల పండుగ. హిందువుల ప్రధాన పండుగలలో ఒకటైన దీపావళిని దేశవ్యాప్తంగా ఎంతో వైభవంగా, ఉత్సాహంగా జరుపుకుంటారు. ఏడాది కూడా దీపావళి పండుగను ఆనందంగా జరుపుకోవాలని దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు భారత ప్రధాని నరేంద్ర మోదీ. అంతేకాదు మోదీ ప్రజలకు ప్రత్యేక విజ్ఞప్తిని చేస్తూ సోషల్ మీడియా వేదికగా ఒక పోస్ట్‌ను పంచుకున్నారు. అందులో 'వోకల్ ఫర్ లోకల్'ను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈ ఏడాది దీపావళిని దేశంలోని భారతీయుల కోసం ప్రత్యేకంగా మార్చాలని ప్రధాని మోదీ అన్నారు. ఈ మేరకు ప్రధాని నరంద్ర మోదీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ఒక పోస్ట్‌ను షేర్ చేశారు. ఈ పోస్ట్‌లో ఇలా రాసుకొచ్చారు. 'వాస్తవానికి, 140 కోట్ల మంది భారతీయుల కృషి గురించి ఈ దీపావళిని చేద్దాం. పారిశ్రామికవేత్తల సృజనాత్మకత, అలసిపోని స్ఫూర్తి కారణంగానే మనం భారతదేశ పురోగతిని నడిపించగలము.' ఈ ఏడాది దీపావళి పండుగను సంబరంగా జరుపుకుందామని దేశ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. లోకల్ ఫర్ వోకల్ అనే నినాదానికి మద్దతు ఇచ్చేందుకు ఈ దీపావళి పండగకు దేశ ప్రజలంతా.. స్థానికంగా తయారైన ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. దీంతో పాటు, అనే వినియోగదారు షేర్ చేసిన వీడియోను ప్రధాని మోడీ రీపోస్ట్ చేశారు. ఈ వీడియోలో, ప్రజలు స్థానిక విషయాలపై దృష్టి పెట్టాలని, వాటిని తమ ఎంపికగా మార్చుకోవాలని కోరారు., దానితో వచ్చే సృజనాత్మకతను ప్రేమించండి! ఈ దీపావళికి భారతీయ పారిశ్రామికవేత్తలు, వ్యాపారాలపై లక్ష్మీదేవి తన ఆశీర్వాదాలను కురిపిస్తుంది!' అంటూ రాసుకొచ్చార ప్రధాని మోదీ. అలాగే ఈ ఏడాది దీపావళి పండుగ సందర్భంగా దేశ ప్రజలు అందరూ స్థానికంగా తయారు చేసిన వస్తువులనే కొనుగోలు చేయాలని భారత ప్రధాని నరేంద్ర మోదీ విజ్ఞప్తి చేశారు. దేశంలో తయారైన వస్తువులను కొనడమే కాకుండా వాటితో సెల్ఫీ ఫోటోలు కూడా దిగాలని సూచించారు.

ఆ ఫోటోలను నమో యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు ప్రధాని. ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపుతో దేశవ్యాప్తంగా స్పందనలు భారీగా వెల్లువెత్తుతున్నాయి.

# వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సుయాత్ర.. 13వ రోజు షెడ్యూల్




తాడేపల్లి : వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికారిత బస్సుయాత్రకు అపూర్వ ఆదరణ లభిస్తోంది. 13వ రోజు సామాజిక సాధికారిత బస్సుయాత్ర పార్వతీపురం, పెదకూరపాడు, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో కొనసాగనుంది. ఉదయం గం. 10.30ని.లకు సీతానగరం మండలం లచ్చయ్యపేటలో వైఎస్సార్‌సీపీ నేతల విలేకర్ల సమావేశం ఉంటుంది. ఉదయం 11గంటలకు కాశయ్యపేట సచివాలయాన్ని వైఎస్సార్‌సీపీ నేతలు సందర్శించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు పార్వతీపురం పాత బస్టాండ్ వద్ద బహిరంగ సభ జరుగనుంది. ఈ సభలో పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ సహా పలువురు పార్టీ నేతలు పాల్గొననున్నారు. పల్నాడు జిల్లా పెదకూరపాడులో ఎమ్మెల్యే నంబూరు శంకర్రావు ఆధ్వర్యంలో బస్సుయాత్ర జరుగనుంది. మధ్యాహ్నం 2 గంటలకు ధరణికోటలో వ్యాపార, ఉద్యోగ ప్రతినిధులతో పార్టీ నేతలు సమావేశం కానున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు విలేకర్ల సమావేశం, గం. 3.45ని.లకు ధరణికోట బేబీ గార్డెన్స్ నుంచి పాదయాత్ర ప్రారంభం అవుతుంది. సాయంత్రం గం. 4ం45ని.లకు గ్రామ సచివాలయాన్ని వైఎస్సార్‌సీపీ నేతలు సందర్శించనున్నారు. సాయంత్రం గం. 5:30 ని.లకు అమరావతిలో బహిరంగ సభ నిర్వహించనున్నారు.

# 'నిప్పుతో చెలగాటమాడుతున్నారు'.. పంజాబ్, తమిళనాడు గవర్నర్‌లపై సుప్రీంకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ: పంజాబ్, తమిళనాడు గవర్నర్‌లపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ రెండు రాష్ట్ర ప్రభుత్వాలు అసెంబ్లీలో ఆమోదించిన బిల్లులను క్లియర్ చేయడంతో గవర్నర్లు చేస్తున్న జ్యాపంపై మండిపడింది. 'మీరు నిప్పుతో చెలగాటమాడుతున్నారు' అని శుక్రవారం ఘాటుగా వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం పంజాబ్, తమిళనాడు గవర్నర్ల తీరును తప్పుపట్టింది. 'ఎన్నికైన ప్రభుత్వాలు అసెంబ్లీలో ఆమోదించిన బిల్లులను దయచేసి ఆలస్యం చేయవద్దు. ఇది ఆందోళన కలిగించే చాలా తీవ్రమైన విషయం. మీరు నిప్పుతో ఆడుకుంటున్నారు' అని ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ అన్నారు. కాగా, బిల్లుల విషయంలో పంజాబ్ గవర్నర్ తీరుపట్ల తాము సంతోషంగా లేమని సుప్రీంకోర్టు పేర్కొంది. 'ఇష్టానుసారం బిల్లులు క్లియర్ చేస్తామని గవర్నర్ ఎలా చెబుతారు? పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని మనం కొనసాగించడంలేదా?' అని ప్రశ్నించింది. భారతదేశం ఏర్పాటు నుంచి కొనసాగుతున్న సంప్రదాయాలు, నియమ నిబంధనలను గవర్నర్లు అనుసరించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది

# చంద్రబాబు బెయిల్ పై విచారణ ఈనెల 15 కు వాయిదా



విజయవాడ,స్కిల్ కేసులో చంద్రబాబు బెయిల్ పిటిషన్ పై విచారణ ఈ నెల 15కు వాయిదా పడింది. అదనపు ఏజీ హాజరు కాలేకపోతున్నట్లు సీఐడీ ప్రత్యేక పీపీ వివేకానంద కోర్టుకు తెలిపారు. ఈ నేపథ్యంలో కోర్టును అయన మరింత సమయం కోరారు. విచారణను ఈనెల 22కు వాయిదా వేయాలన్న అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. మరోసారి గడువు పొడిగించేది లేదని తేల్చి చెప్పింది. విచారణను ఈ నెల 15కు వాయిదా వేసింది.

# విజయవంతమైన ఈవీఎంల మాక్ పోల్

## ఎఫ్.ఎల్.సి విజయవంతం పై ఉద్యోగులకు కలెక్టర్ అభినందనలు...
## 16 మంది బెల్ ఇంజనీర్లకు జ్ఞాపికలు..
## జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన...



కర్నూలు నవంబర్ 10 విభారె న్యూస్. స్థానిక కలెక్టరేట్ ఈవీఎం గోడౌన్ లోని మొదటి అంతస్తులో జరుగుతున్న ఈవీఎంల మాక్ పోల్ ప్రక్రియ నేటితో పూర్తి అయిందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఈ.వి.యమ్ గోడౌన్ లోని మొదటి అంతస్తులో జరుగుతున్న మాక్ పోల్ కార్యక్రమాన్ని పరిశీలించి అనంతరం ఈవీఎంల ఫస్ట్ లెవెల్ చెక్ విజయవంతంగా పూర్తి చేసినందుకు 16 మంది బెల్ కంపెనీ ఇంజనీర్లను అభినందించిన జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన వారికి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల నిర్వహణ కోసం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ప్రథమ స్థాయి పరిశీలన విజయవంతంగా ముగిసిందని కలెక్టర్ తెలియజేశారు. ఈవీఎంల ఫస్ట్ లెవెల్ చెక్ విజయవంతంగా పూర్తి చేసినందుకు 16 మంది బెల్ ఇంజనీర్లను, డిఆర్ఓ కే.మధుసూదన్ రావు, ఈవీఎం ల ఎఫ్ ఎల్ సి (ఫస్ట్ లెవెల్ చెకప్) నోడల్ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి నాగరాజ నాయుడు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి ని కలెక్టర్ అభినందించారు. కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వివి ప్యాట్లకు సంబంధించి ఎఫ్ ఎల్ సి కార్యక్రమం బెల్ ఇంజనీర్లు, రెవెన్యూ, పంచాయితీ రాజ్, ఇతర సిబ్బంది నిర్వహించిన ఫస్ట్ లెవెల్ చెకింగ్ పూర్తయిందన్నారు. ఇందులో పార్లమెంటుకు సంబంధించి 2741 కంట్రోల్ యూనిట్లు, 3355 బ్యాలెట్ యూనిట్లు, 3293 వివి ప్యాట్లు మొదటి దఫా పరిశీలన పూర్తిచేసుకుని ఓటింగ్ ప్రక్రియకు సిద్ధంగా ఉన్నాయన్నారు. అలాగే అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 2740 కంట్రోల్ యూనిట్లు, 3354 బ్యాలెట్ యూనిట్లు, 3300 వివి ప్యాట్లు మొదటి దఫా పరిశీలన పూర్తిచేసుకుని ఓటింగ్ ప్రక్రియకు సిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ వివరించారు.

# మిడుతూరు మండల స్పందనకు 117 దరఖాస్తులు

## జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 10- మిడుతూరు మండల స్థాయి జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన ప్రజా ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం మిడుతూరు మండల కేంద్రంలోని వెలుగు ఐకెపి కార్యాలయ ఆవరణలో మండల స్థాయి జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు డిఆర్ఓ పుల్లయ్య ఇతర జిల్లా అధికారులు ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిచ్చి మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఈ మేరకు ఫిర్యాదుదారుల నుండి స్వీకరించిన విజ్ఞప్తులను సీరియస్ గా తీసుకొని ప్రత్యేక దృష్టితో పరిష్కరించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రతి వారం స్పందన, సచివాలయాల్లో ప్రతిరోజు 3 నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ గ్రామస్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యలు కూడా ఎందుకు పరిష్కారం కావడం లేదని కలెక్టర్ ఎంపీడీఓ, తాసిల్దార్లను ప్రశ్నించారు. పంచాయతీ సెక్రటరీలు, వీఆర్వోలు, మండల స్థాయి అధికారులు ప్రజా సమస్యలకు సంబంధించిన ప్రతి అంశాన్ని సీరియస్ గా తీసుకొని తక్షణ పరిష్కార మార్గం చూపాలని కలెక్టర్ ఆదేశించారు. పరిష్కారం కాని సమస్యలపై సంబంధిత ఫిర్యాదారులకు క్లియర్ గా చెప్పి క్లోజ్ చేయాలన్నారు. మండలానికి సంబంధించి అధికారులు సరిగా పనిచేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయని... అందువల్లే దరఖాస్తులు రీఓపెన్ కావడం, ప్రజల అసంతృప్తి ఉందన్నారు. నాడు నేడు కింద చేపట్టిన పాఠశాలలో నిర్మాణ పనులు, విద్యార్థుల ఉత్తీర్ణతశాతంపై ప్రత్యేక దృష్టి సారించాలని విద్యాశాఖ అధికారులను కలెక్టర్ ఆదర్శించారు. గ్రాస్ ఎన్రోల్మెంట్ సర్వేపై కేంద్ర బృందం పర్యవేక్షిస్తుందని వాలంటీర్లతో మరోసారి వెరిఫై చేయించాలని కలెక్టర్ సూచించారు. మండల స్థాయి స్పందనకు 117 దరఖాస్తులు వచ్చాయని వీటన్నింటినీ సీరియస్ గా తీసుకొని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత కాల వ్యవధిలోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.. అనంతరం ఈనెల 14 నుండి 25 వరకు నిర్వహించే జాతీయ సహకార వారోత్సవాల గోడపత్రికను కలెక్టర్ విఆర్ఓ జిల్లా సహకార అధికారి తదితరులు ఆవిష్కరించారు

# ప్రజా సంక్షేమమే జగనన్న ధ్యేయం

## శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి ఎమ్మెల్యే



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 10- ప్రజా సంక్షేమమే జగనన్న ధ్యేయం అని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి పేర్కొన్నారు . శుక్రవారం రైతునగరం 1వ సచివాలయం నందు వైసీపీ కౌన్సిలర్ చంద్ర శేఖర్ రెడ్డి అధ్యక్షతనతో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ కు జగన్ ఎందుకు కావాలంటే (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమంకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి. మున్సిపల్ కమిషనర్ రవి చంద్రా రెడ్డి. అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్. మేప్మ పీడీ భాస్కర్ రెడ్డి. హాజరు అయ్యారు. .ముందుగా సచివాలయ కన్వీనర్లు ,గృహ సారథులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి 1వ సచివాలయంకు చేరుకొని డిబిటి -నాన్ డిబిటి ద్వారా అందిస్తున్న నవరత్నాల పథకాల అమలు సంబంధించిన డిస్ ప్లే బోర్డును ఆవిష్కరించిన అనంతరం వైయస్సార్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన వైయస్సార్సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతునగరం వార్డు కు 16.కోట్లు 73 లక్షల. వివిధ రకాల పనులకు ఖర్చు చేసినట్లు తెలిపారు. ,వై నీడ్స్ ఏపీ జగన్ కార్యక్రమం ద్వారా మరోసారి ప్రతి గడపకు వెళ్లి 2014 చంద్రబాబు పాలన, 2019 నుంచి జగనన్న అందిస్తున్న పాలనా వ్యత్యాసంను వివరిస్తూ మళ్ళీ ఆంధ్రప్రదేశ్ కు జగన్ ఎందుకు కావాలంటే అనే విషయాన్ని వివరిస్తూ వైకాపా ముఖ్య నాయకులు,సచివాలయ కన్వీనర్లు,గృహ సారథులు, వాలింటర్లతో కలిసి గృహాలను సందర్శించడం జరుగుతుందని ఆయన తెలిపారు. అనంతరం కిట్ బ్యాగ్ లను అందజేశారు. ఈకార్యక్రమంలో నాయకులు, సచివాలయ కన్వీనర్లు,గృహ సారథులు, కార్యకర్తలు,వైయస్సార్ అభిమానులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

శనివారం 11-11-2023

## నినాదంగా మిగిలిపోతున్న రోడ్డు భద్రత

సగటున ప్రతీ గంటకు 53 ప్రమాదాలలో 19 మంది ప్రాణాలు కోల్పోతున్నారు. మొత్తం ప్రమాదాలలో 33.80 శాతం మంది అక్కడికక్కడే ప్రాణాలు వదులుతున్నారు. ఇందులో గుర్తు తెలియని వాహనాల వల్లనే అత్యధికంగా 30,486 (18.10%) మంది ప్రాణాలు కోల్పోయారు. ఇటీవలే జాతీయ రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ 2022 సంవత్సరంలో జరిగిన రోడ్డు ప్రమాదాలపై నివేదికను విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం, మనదేశంలోని జాతీయ, రాష్ట్ర, ఇతర రహదారులన్నీ కలిపి 63.31లక్షల కిలోమీటర్ల పొడవుతో ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద రోడ్డు వ్యవస్థ కలిగి ఉన్నది. ఇందులో జాతీయ రహదారులు 1.32 లక్షల కి.మీ ( 2.1%), రాష్ట్ర రహదారులు 1.80 లక్షల కి.మీ ( 2.8 % ), ఇతర రహదారులు 60.59 లక్షల కి.మీ (95.1%) పొడవు కలిగి ఉన్నాయి. మొత్తం రవాణా వ్యవస్థలో సరుకు రవాణాలో 71 శాతం, ప్రయాణీకుల రవాణాలో 85 శాతం రోడ్డు మార్గం ద్వారానే జరుగుతున్నాయి. 2022 సంవత్సరంలో దేశవ్యాప్తంగా 4,61,312 రోడ్డు ప్రమాదాలలో గాయాలపాలవ్వగా, 1,68,491 మంది ప్రాణాలు కోల్పోయారు. అదే 2021 సంవత్సరంలో మొత్తం 4,12,432 రోడ్డు ప్రమాదాలలో 1,53,972 మంది మృత్యువాత పడగా 3,84,448 మంది క్షతగాత్రులయ్యారు. 2021 కంటే 2022 లో పెరిగిన శాతం వరసగా 11.9 శాతం, 9.4 శాతం, 15.3 శాతంగా ఉంది. ఒక లక్ష జనాభాకు జరుగుతున్న ప్రమాదాల సంఖ్య 2021 సంవత్సరంలో 30.3% ఉండగా, 2022 సంవత్సరం వచ్చేసరికి ఇది 33.5 శాతానికి పెరిగింది. అదే రోడ్డు ప్రమాద తీవ్రత 2021 సం.లో 37.3 శాతంగా ఉంటే 2022లో 36.5 కి తగ్గింది. దేశసగటు కంటే ఎక్కువగా ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఉన్నాయి. దేశం మొత్తం మీద ఉన్న పదివేల వాహనాలకు గాను 1970లో 103.5 మంది, 1980లో 53.10 మంది, 1990లో 28.20 మంది, 2000లో 16.2 మంది, 2010లో 10.50 మంది చనిపోగా 2020 సంవత్సరం వచ్చేసరికి 4.2 మంది మాత్రమే చనిపోయారు. చూడడానికి ఇవి తగ్గుతున్నట్టు అనిపిస్తున్నా రానురాను వాహనాల సంఖ్య పెరిగిపోతుండటంతో ప్రమాదాలు, మరణాలు ఎక్కువవుతున్నాయి. దేశంలో 2022 లో జరిగిన ప్రమాదాలలో తమిళనాడు 18,972 (12.5%) మొదటి స్థానంలో ఉండగా, కేరళ 17,627 (11.6 %), ఉత్తరప్రదేశ్ 14,990 ( 9.9 %), మధ్యప్రదేశ్ 13,860 (9.1 %), కర్ణాటక 13384 (8.8 %) తరువాత నాలుగు స్థానాల్లో ఉన్నాయి. మన తెలుగు రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ 8650 ( 5.7 % ), తెలంగాణా 7505 ( 4.9 % )తో వరుసగా 7 మరియు 8 స్థానాల్లో ఉన్నాయి. ప్రమాదాలకు కారణాలలో మొదటిది అతి వేగం. దీనివల్ల 2022 సంవత్సరంలో 72.3 శాతం ప్రమాదాలు జరిగాయి. 71.2 శాతం మంది ప్రాణాలు కోల్పోయారు. 72.8 శాతం మంది గాయాల పాలయ్యారు. ఆ తర్వాత మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, రాంగ్ రూట్‌లో వెళ్ళడం, ట్రాఫిక్ నియమాలు పాటించకపోవడం, మొబైల్ ఫోన్లతో డ్రైవింగ్ చేయడం, హెల్మెట్ ధరించకపోవడం, సీటు బెల్టు పెట్టుకోకపోవడం, మైనర్లు డ్రైవింగ్ చేయడం వంటి కారణాలతో పాటుగా గతుకులతో కూడిన రహదారులు కూడా మరో ప్రధానమైన కారణం. ఇంకా పాదచారుల నిర్లక్ష్యం, వాహనాలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం, రోడ్డు నిర్మాణంలో లోపాలు, నిద్ర లేకుండా సుదీర్ఘంగా వాహనాలను నడపడం, కాలం చెల్లిన భద్రతా ప్రమాణాలు లేని వాహనాలలో ప్రయాణం చేయడం, అర్ధరాత్రి తర్వాత కూడా వాహనాలు నడపడం, ట్రాఫిక్ చిహ్నాలపై అవగాహన లేకపోవడం, వయస్సు మళ్ళిన వారు డ్రైవింగ్ చేయడం, నో పార్కింగ్ జోన్లలో వాహనాలు నిలపడంతో పాటుగా స్పీడ్ బ్రేకర్స్ మీద తెలుపు చారలు గుర్తించక పోవడం, మలుపుల దగ్గర సైన్ బోర్డులు ఏర్పాటు చేయక పోవడం వంటివి కూడా ఇతర కారణాలు. ఈ ప్రమాదాలలో కుటుంబ యజమాని మృత్యువాత పడితే ఆ కుటుంబాలు వీధిన పడతాయి. నైపుణ్యం కల వారు చనిపోతే, సేవలు లభించక దేశ జీడీపీపై ప్రభావం పడుతుంది. సరుకులతో వెళ్తున్న వాహనాలు ప్రమాదానికి గురైతే యాజమానులు ఆర్థికంగా నష్టపోతారు. వాహనాలు పనికిరాకుండా పోతాయి. బీమా సంస్థలకు కూడా ఎంతో నష్టం వాటిల్లుతుంది. వేగంగా వాహనాలు నడపరాదు. బ్లూటూత్, మొబైల్ వాడుతూ డ్రైవింగ్ చేయరాదు. రాత్రిపూట రోడ్డుపై వాహనాలు నిలుపరాదు. తెల్లవారు జామున వాహనాలు డ్రైవింగ్ చేయకూడదు. జన సమూహం ఎక్కువగా ఉన్న చోట, పాఠశాలల వద్ద నిదానంగా వెళ్ళాలి. ఒకే విడతలో ఎక్కువ గంటలు ట్రక్కులు నడుపరాదు. రాత్రిళ్ళు చీకటిలో సైకిళ్లపై ప్రయాణం చేయకూడదు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు, కార్లలో ప్రయాణం చేయువారు సీటు బెల్టులు ధరించాలి. తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వరాదు. అతి వేగానికి అడ్డుకట్ట వేయడానికి రహదారుల వెంబడి ఎక్కువ సంఖ్యలో స్పీడ్ గన్స్ ఏర్పాటు చేయాలి. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేయాలి. స్పీడ్ బ్రేకర్స్ మీద తెలుపు రంగు తో పాటు రేడియం ఎరుపు రంగు చారలు ఉండేటట్లు చూడాలి. మలుపుల దగ్గర, ప్రమాదాలు జరగడానికి అవకాశం ఉన్న దగ్గర సైన్ బోర్డులు పెట్టాలి. అవసరం లేని వారికి స్పోర్ట్స్ బైక్స్ నిషేధించాలి. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపేవారిపై జరిమానాతో పాటుగా 5 సంవత్సరాల వరకు కొత్తగా లైసెన్సులు జారీ చేయకూడదు.

## పాఠశాల స్థాయి చెకుముకి పోటీలు విజయవంతం జన విజ్ఞాన వేదిక.





కోసిగి, నవంబర్ 10(విభారె న్యూస్) మండల కేంద్రమైన కోసిగిలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్ సంబరాల్లో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోసిగి నందు చెకుముకి పాఠశాల స్థాయి పోటీలను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఖలీల్ అహ్మద్ మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక చెకుముకి పోటీలను నిర్వహించడం కోసిగి ప్రాంతానికి శుభ పరిణామమని తద్వారా బాగా వెనుకబడిన కోసిగి ప్రాంతంలో సైన్స్ పట్ల ఆసక్తిని,కుతూహలాన్ని విద్యార్థులలో కలిగిస్తోందని తెలియచేశారు. విద్యార్థులు ప్రతి అంశాన్ని గుడ్డిగా విశ్వసించకుండా ఎందుకు ?ఏమిటి ?ఎలా? అని ప్రతీది ప్రశ్నించే తత్వంతో విద్యార్థులు శోధించి భవిష్యత్తు సవాళ్లకు పరిష్కారాలు కనుగొనే ఆవిష్కర్తలుగా రూపొందాలని పిలుపునిచ్చారు. మూఢనమ్మకాలు, అందవిశ్వాసాలు సమాజం నుంచి తొలగిపోయి ప్రతి ఒక్కరి జీవితాలలో శాస్త్రీయ భావజాలం ప్రతిఫలించినప్పుడు శాస్త్రీయ సమాజం ఆవిర్భవిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు శంకరయ్య మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక నవంబర్ 7వ తేదీ నుంచి ఫిబ్రవరి 28 వరకు ప్రజల్లో సైన్స్ గురించి అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తుందని, నవంబర్ 10 తేదీని యునెస్కో అంతర్జాతీయ సైన్స్ దినంగా పాటిస్తుందని ,ఈ సంవత్సరం సైన్స్ పట్ల నమ్మకం అలాగే ఓపెన్ సైన్స్ అనే అంశాలతో ప్రజల్లోకి వెళుతుందని తెలియజేశారు. ప్రపంచం లో మానవుడు ఓవైపు మార్స్ పైన నివాసం ఏర్పర్చుకోవాలని ఆశయంతో ముందుకెళ్తుంటే, మరోవైపు అంతులేని మూఢనమ్మకాల తో కొట్టుమిట్టాడుతుందని తెలియజేశారు .శాస్త్రీయ విద్య ద్వారా మాత్రమే భవిష్యత్ సమాజం సమగ్ర అభివృద్ధి సాధిస్తుందని తెలియజేశారు. పాఠశాల స్థాయి చెకుముకి పోటీలు విజయవంతం చేయడానికి ప్రత్యక్షం గా, పరోక్షంగా సహకరించిన ప్రధానోపాధ్యాయులకు అలాగే వివిధ పాఠశా లల ఉపాధ్యాయులు అందరికి జనవి జ్ఞాన వేదిక కృతజ్ఞతలు తెలియజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తో పాటు ఉపాద్యాయులు అంతయ్య, గురుస్వామి,వెంకటరెడ్డి, రవికుమార్, సుభాన్ సింగ్, రహీం, మేఘనాథ్, మహేష్ ,చంద్రశేఖర్, సులేమాన్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విజయవాడ నగర మునిసిపల్ కార్మికుడి మృతికి సంతాపం.. సిఐటియు



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:- నవంబర్ 10 డోన్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నందు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు అనుబంధం విజయవాడ నగర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ మన్యం దేవిడ్ గారి మృతికి సిఐటియు పట్టణ కార్యదర్శి టి.శివరాం, మండల అధ్యక్ష,కార్యదర్శులు పి.రామాంజనేయులు,ఏ.వి. భాస్కర్ రెడ్డి,మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.కుల్లాయప్ప,ఉపాధ్యక్షులు కె.పెద్దఎల్లయ్య సంతాపం వ్యక్తం చేశారు. మృతుని చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.ఈ సందర్భంగావారుమాట్లాడుతూ అనారోగ్యం తో నిన్నటి దినం మృతి చెందినదేవిడ్‌గారిఅకాలమరణం బాధాకరమని,ఆయన మున్సిపల్ కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహించిన నాయకుడని ఆయన త్యాగనిరతిని,పోరాట పటిమను కొనియాడారు.భౌతికంగా ఆయన దూరం కావడం వారి కుటుంబానికే కాక కార్మిక వర్గానికి కూడా తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.వారు లేకపోయినా వారి ఆశయ సాధన కొరకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఏసు,ఆవులయ్య,దేవదానం, రామాంజి,వెంకటలక్ష్మమ్మ,అంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే బాలినాగి రెడ్డి

**ప్రభుత్వం ద్వారా లబ్ధి పొంది ఉంటే మళ్లీ సీఎంగా ఆదరించండి**





పెద్దకడబూరు నవంబర్ 10 ( విభారె న్యూస్) పెద్దకడబూరు మండలంలోఏపీకిమళ్లీ జగనేఎందుకుకావాలి కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో వైసీపీ జెండాను ఆవిష్కరించారు. అలాగే అక్కడే ఉన్నదివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖ రరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు రాష్ట్ర ప్రజలకు జగన్‌ద్వారా లబ్ధి పొంది ఉంటే మళ్లీ సీఎంగా ఆదరించండం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొంది ఉంటే మళ్లీ సీఎంగా ఆదరించా లని వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి పిలుపుని చ్చారు. ఏపీకి మళ్లీ జగనే ఎందుకు సీఎం కావాలి అనే కార్యక్రమంలో రామ్మోహన్ రెడ్డి మాట్లాడారు. జగన్ సంక్షేమ పథకాల ద్వారాగ్రామాల్లోని ప్రజలకుకోట్లరూపాయల లబ్ధి చేకూరిందన్నారు. మాట ఇస్తే ఫతప్పని సీఎం జగన్మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి స్పష్టం చేశారు. షాదీఖానాలో జరిగిన ఏపీకి మళ్లీ జగనే సీఎం ఎందుకు కావాలి అనే కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల వారికి అమలవుతున్న సంక్షేమ పథకాలు రాబోయే రోజుల్లో అందాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్ కావాలని, ఇందు కోసం ప్రజలు జగన్ ను మళ్లీ సీఎంగా దీవించాలని కోరారు ఇందులో వైసీపీ నేతలు పురుషోత్తం రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రవిచంద్రారెడ్డి, రామాంజనేయులు, రఘురామ్, ఈరన్న వైఎస్ఆర్ సిపి మండల గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు


## ఏపీకి మళ్ళీ జగన్ సీఎం ఎందుకు కావాలి అనే కార్యక్రమంలో కంబళదిన్నె వైఎస్ఆర్ సిపి నాయకులు బైక్ ర్యాలీ



పెద్దకడబూరు నవంబర్ 10 ( విభారె న్యూస్) పెద్దకడబూరు మండలంలో కంబాలదిన్నె గ్రామ వైఎస్ఆర్సిపి నాయకులు.పెద్దకడబూరు.మండలానికి మంత్రాలయం. ఎమ్మెల్యే వై బాలనాగరెడ్డి రాకతో..కంబాలదిన్నె గ్రామం నుండి.పెద్దఎత్తున. వైఎస్ఆర్సిపి నాయకులు బైక్. ర్యాలీ.గా.వెళ్లిన.వైఎస్ఆర్సిపి నాయకులు.. మారెన్న.. మాజీ సర్పంచ్ ఈరన్న.. భీమన్న.. కర్రన్న.. మాజీ ఎంపిటిసి గోవిందు తదితరులు పాల్గొన్నారు

## భాష్యం స్కూల్లో ఘనంగా దీపావళి వేడుకలు..





ఎమ్మిగనూరు నవంబర్ 10 విభారె న్యూస్.పట్టణంలోని భాష్యం ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ లో శుక్రవారం ప్రిన్సిపాల్ మాచాని కవిత ఆధ్వర్యంలో ముందస్తు దీపావళి పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ముందుగా దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేసి టపాసులు కాల్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాచాని కవిత మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయాన్ని గుర్తుగా జరుపుకునే పండుగ దీపావళి అన్నారు. ఇంట్లోనే ప్రతికూల శక్తులను తొలగించి నూతన వెలుగులు తీసుకువచ్చే గొప్ప పండుగ అని ఈ పండుగను హిందువులతో పాటు జైనులు,బౌద్ధులు, సిక్కులు ఇతర మతస్తులు ఆరోగ్యము సంతోషాన్ని కోరుకుంటూ సెలబ్రేట్ చేసుకునే పర్వదినిమే దీపావళి అని తెలిపారు. పాఠశాలలో అన్ని పండుగలు విశేషాలను ,విశిష్టతను విద్యార్థులు తెలియచేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంల అధ్యాపకబృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైల దేవస్థానానికి భక్తుల విరాళం.





శ్రీశైలం నవంబర్ 10 విభారె న్యూస్.శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారి దేవాలయంలో ప్రతినిత్యం భక్తులకు జరిగే అన్న ప్రసాద వితరణ కు శుక్రవారం రోజు హైదరాబాద్ వాస్తవ్యులు రు.1,00,500 లను ఐ. సుబ్రహ్మణ్యం వారు, బి. ఆనంద్ బాబు బాపట్ల వాస్తవ్యులు రు.1,00,500 లను సహాయ కార్యనిర్వహణాధికారి ఎం. ఫణి ధర ప్రసాద్, పర్యవేక్షకులు టి. హిమబిందుకు అందజేశారు. వీరికి దేవస్థానం వారు స్వామి అమ్మవార్ల యొక్క ప్రత్యేక దర్శనం చేయించి, శాలువాతో సత్కరించి, స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని, లడ్డు ప్రసాదాన్ని అందజేశారు.



## మళ్లీ జగనే రావాలి...

విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- నవంబర్ 10 క్రిష్ణగిరి మండలం రామకృష్ణాపురం గ్రామంలో ఆంధ్ర ప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం రెండవ రోజు నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా క్రిష్ణగిరి మండల అధ్యక్షులు డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు గ్రామం మొత్తం పర్యటిస్తూ ఇంటింటికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో క్రిష్ణగిరి వైఎస్ఆర్సిపి నాయకులు రామకృష్ణాపురం వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ఎట్టకేలకు చిక్కిన మొసలి

**ఊపిరి పీల్చుకున్న అధికారులు, స్థానికులు**

అమలాపురం,అంబేద్కర్ కోనసీమ జిల్లాలో గత మూడు నెలలుగా ప్రజల ను భయపెట్టిన మొసలి ఎట్టకేలకు అమలాపురంలో వలకు చిక్కింది. విశాఖ జూ నుండి వచ్చిన డాక్టర్ ఫణీంద్ర నేతృత్వంలో మొసలిని అటవీ శాఖ అధికారులు బంధించారు.గత నెల రోజులుగా అమలాపురంలో తిష్ట వేసి ప్రధాన పంట కాలువలో తిరుగుతున్న మొసలిని తాళ్ళ సహాయంతో అటవీ శాఖ సిబ్బంది బంధించడంతో స్థానికులు ఊపిరి పీల్చు కున్నారు. సెప్టెంబర్ నెలలో గోదావరి నది నుండి ధవళే శ్వరం బ్యారేజ్ ద్వారా ఆత్రేయపురం మండలం బొబ్బ ర్లంక పంట కాలువలోకి మొసలి ప్రవేశించింది. గత మూ డు నెలలుగా ప్రజలను భయపెట్టిన మొసలి చివరకు అమలాపురం మండలం సమనస గ్రామంలో పంట కాలువలో వలకు చిక్కింది. అమలాపురంలో బంధిం చిన మొసలిని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా,ఎస్పీ ఎస్. శ్రీధర్ పరిశీలిం చారు.మొసలిని బంధించ డంలో కృషి చేసిన అధికారులను,అటవీ పోలీసు శాఖ సిబ్బందిని జిల్లా కలెక్టర్ అభినం దించారు. పట్టు కున్న మొసలిని మారేడుమిల్లి తరలించి అక్కడ పాములేరులో వదిలి పెడతామని అయన తెలిపారు.

# అసంతృప్తి నేతలకు దారెటు

విజయవాడ, నవంబర్ 10,రాజకీయ పార్టీలలో ఎన్నికల సమయంలో అలకలు, అసంతృప్తులు సహజమే అయినా ఏపీలో చాలామంది అసంతృప్త నేతలకు ఇప్పుడు రెండో ఆప్షన్ లేకుండా పోయింది. 2019 ఎన్నికల్లో వైసీపీ తరపున పోటీ చేసిన వారిలో 151మంది అభ్యర్థులు గెలుపొందారు. 2024 ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయాలనే ఉద్దేశంతో రకరకాల ప్రచారాలు ప్రారంభించారు. రకరకాల కార్యక్రమాలతో వైసీపీ కాంపెయిన్ కార్యక్రమాలను నిర్వహిస్తోంది.ప్రచార కార్యక్రమాల కంటే టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు అరెస్ట్ ద్వారా వైసీపీ ఎక్కువ లాభపడినట్టు భావిస్తోంది. చంద్రబాబు అరెస్ట్‌తో తమ పార్టీకి గణనీయంగా సానుభూతి లభించిందని టీడీపీ భావిస్తున్నా వైసీపీ మాత్రం తమ పార్టీ నేతలకు గట్టి సందేశం పంపగలిగినట్టు భావిస్తోంది. వైసీపీలో అసంతృప్త నేతలు ఫిరాయింపులకు పాల్పడకుండా, ఎన్నికల సమయంలో పార్టీని దెబ్బతీయకుండా చంద్రబాబు అరెస్ట్ ఉపయోగపడిందని భావిస్తున్నారు.చంద్రబాబు రిమాండ్‌లో ఉన్న 53రోజుల్లో టీడీపీ కార్యక్రమాలు పూర్తిగా స్తంభించిపోయాయి. చంద్రబాబు లేకపోతే టీడీపీ బలం ఏమి ఉండదనే అంచనాకు వైసీపీ వచ్చేసింది. వైద్యపరీక్షలు, శస్త్ర చికిత్స కోసం బాబుకు బెయిల్ లభించినా ఎన్నికల సమయానికి మళ్లీ ఏదొక కేసులో అరెస్ట్ చేసే అవకాశాలు లేకపోలేదని ప్రచారం జరుగుతోంది.మరోవైపు చంద్రబాబు అరెస్ట్‌కు కొద్ది నెలల ముందు టీడీపీ దూకుడుగా వ్యవహరించింది.ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో అధికార పార్టీ నుంచి నలుగురు ఎమ్మెల్యేలు తెలుగుదేశం పార్టీలోకి వెళ్లారు. ఎన్నికల నాటికి రకరకాల కారణాలతో మరికొందరు పార్టీని వీడి తెలుగుదేశం గూటికి చేరుతారని ప్రచారం జరిగింది. చంద్రబాబు అరెస్ట్ తదనంతర పరిణామాలతో ఇప్పుడు వైసీపీలో ఉన్న అసంతృప్త నేతలకు మరో ప్రత్యామ్నయం లేకుండా పోయింది. చంద్రబాబు ప్రస్తుతం ఎదుర్కొంటున్న కేసులు ఎప్పటికి కొలిక్కి వస్తాయో తెలియని పరిస్థితుల్లో పార్టీ వీడాలనే ఆలోచనలకు కూడా ముగింపు పలకాల్సిన అవసరం ఏర్పడింది.రానున్న ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలకు సీట్లు గ్యారంటీ అనే భరోసా వైసీపీలో లేదు. సర్వేలు, పనితీరు ఆధారంగానే టిక్కెట్ల కేటాయింపు ఉంటుందని సిఎం పదేపదే చెబుతున్నారు. టిక్కెట్లు దక్కకపోయినా పార్టీలో ప్రభుత్వంలో తగిన గుర్తింపునిస్తామని బుజ్జగిస్తున్నారు. మంత్రులుగా ఉన్న వారికి కూడా వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడం ఖాయమనే భరోసా ఇంకా దక్కలేదు.అయితే ఎలాంటి అనుమానం, అభద్రత ఉన్నా నేతలందరికీ వైసీపీలో కొనసాగడం మినహా మరో అవకాశం లేకుండా పోయిందని ఆ పార్టీలో చర్చ జరుగుతోంది. ప్రత్యర్థులను ఆర్థికంగా కట్టడి చేయడంతో పాటు ఎన్నికల నాటికి వారికి క్యాష్ మేనేజ్‌మెంట్ చేయకుండా కట్టడి చేయకుండా జగన్ ఇప్పటి నుంచి పక్కా ప్రణాళిక అమలు చేస్తున్నారని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.ప్రస్తుతం టీడీపీ ఉన్న పరిస్థితుల్లో టీడీపీ నేతల్ని సంప్రదించడం, ఆ పార్టీలోకి వెళ్లాలనే ప్రయత్నాలు చేయడం కొరివితో తలగోక్కోవడమే అవుతుందని అంచనా వేస్తున్నారు.

# పాలాస్తినపై ఇజ్రాయిల్ సాగిస్తున్న నరమేధం ఆపాలి....

**సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్ డిమాండ్**







విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- నవంబర్ 10 డోన్ పట్టణంలో బేతంచెర్ల సర్కిల్ నందు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పాలాస్తినపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని రాస్తారోకో నిర్వహించారు, ఈ కార్యక్రమానికి సిపిఎం పట్టణ కమిటి సభ్యులు షేమిమ్ బేగం అధ్యక్షత వహించారు,సిపిఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, సీఐటీయూ పట్టణ కార్యదర్శి శివరాం మాట్లాడుతూ, పాలాస్తినపై అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ సాగిస్తున్న నరమేధాన్ని ఆపాలని వారు డిమాండ్ చేశారు, ఐక్యరాజ్యసమితి నిర్ణయాలకు అనుగుణంగా పాలాస్తిన భు భాగాల నుంచి ఇజ్రాయిల్ పూర్తిగా పక్కకు తప్పుకోవాలని, భారత ప్రభుత్వం తటస్థ వైఖరిని విడనాడి పాలాస్తినా ప్రజలకు మద్దతు ప్రకటించి సహాయ సహకారాలు అందించాలని నినాదించారు, అమెరికా మద్దతుతోనే పాలాస్తిన ప్రజలపై ఇజ్రాయిల్ అత్యంత భయంకరమైన దాడులు పాల్పడుతుందని విమర్శించారు ,యుద్ధ నియమాలకు వ్యతిరేకంగా నివాస ప్రాంతాలపైన, చివరికి ఆసుపత్రుల పైన ,స్కూల్ ల పైన దాడులు చేస్తుందన్నారు, యుద్ధ బాధిత ప్రజలకు యుఎన్ఓ సహాయక చర్యలను సైతం అడ్డుకుంటుందని తెలిపారు అమెరికా తన సామ్రాజ్యవాద ప్రయోజనాల కోసం ఇజ్రాయిల్ ను పూర్తిగా బలపరుస్తుందని విమర్శించారు, మధ్యప్రచయంలో తమ ఆధిపత్యాన్ని పూర్తిగా నెలకొల్పుకునేందుకు ఇజ్రాయిల్ని అమెరికా ,బ్రిటన్లు సృష్టించాయన్నారు, అక్కడున్న ఆయిల్ వనరులను కాజేయడానికి మధ్యప్రచ్య దేశాల్లోని పాలకులను లోపర్చుకోవడానికి వ్యూహాత్మకంగా పట్టు సాధించడానికి ఇజ్రాయిల్ ను ఉపయోగించుకుంటుందని ఒక టెర్రరిస్టు దేశంగా అమెరికా మార్చేసిందని విమర్శించారు, దీనిని పౌర ప్రజా సంఘాలన్నీ వ్యతిరేకించాలని వారు కోరారు ,గత నెల రోజుల నుంచి ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడులు తక్షణమే ఆపాలి 30 రోజుల్లో పదివేల మంది దాకా చనిపోయారు వీరిలో మహిళలు పిల్లలు అధికము ఇజ్రాయిల్ ఊచకోత ఏదేచ్ఛగా సాగిస్తున్న దీనిని ఆపేందుకు అమెరికా ఒప్పుకోవడం లేదు గాజాలో ఇజ్రాయిల్ అదే పనిగా సాగిస్తున్న బాంబు దాడులు జాతి ప్రక్షాళనకుదారి తీసే ప్రమాదం ఉందని ఐక్యరాజ్యసమితి నిపుణులు హెచ్చరించారు ,కాబట్టి తక్షణమే పాలస్తీలపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని వారు డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమము లో సిపిఎం నాయకులు భాస్కర్ రెడ్డి, కొండయ్య, నాగమద్దయ్య, నక్కీ హరి ,సుధాకర్ ,షబానా, రామకృష్ణ ,రామలింగం, గోపాల్, మనోహర్ ,రామాంజనేయులు, విజయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే బాలనాగ రెడ్డి ఆదేశాల మేరకు సంక్షేమ పథకాలు బోర్డు ఆవిష్కరించిన సర్పంచ్ పాల్ దినకర్.





కౌతాళం మండలం ( విభారే న్యూస్ నవంబర్ 10 )గౌరవ ఎమ్మెల్యే శ్రీ బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకే మరియు కర్నూలు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈరోజు అనగా 10/11/2023 వ తేదీ శుక్రవారం 3:30 గంటలకు కౌతాళం మండలం, కౌతాళం గ్రామ సచివాలయం -2 (2 వ రోజు) ఆవరణములో గౌరవ సర్పంచ్ శ్రీ పాల్ దినకర్ అధ్యక్షతన " సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో సుబ్బారాజు, హాజరైన వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ శ్రీ దేశాయి ప్రహల్లాద స్వామి, మండల వైస్ ఎమ్ పిపి-1 శ్రీ రామలింగయ్య స్వామి, గౌరవ మాజీ ప్రజా ప్రతినిధులు వైయస్సార్సీపి నాయకులు అవతారం, ఉమాపతి, స్కూలు కమిటీ చైర్మన్ వడ్డే రామన్న, పంచాయితీ కార్యదర్శులు చెన్నయ్య, ఆంజనేయులు, వార్డ్ మెంబర్లు, సచివాలయ కన్వీనర్లు, సచివాలయం సిబ్బంది మరియు వాలంటీర్స్ పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మరియు ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వము నుండి వివిధ పథకాల ద్వారా లబ్ది పొందిన లబ్ధిదారులు అందరికీ సంక్షేమ పథకాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని కోరడం జరిగింది.

# జీవితానికి విద్యార్థి దశ కీలకం

**ఎ.భార్గవ్ తేజ,కమిషనర్ లక్ష్యం లేకుంటే విజయం దక్కదు**

**వేణు కళ్యాణ్,లైఫ్ బిజినెస్ కోచ్ అత్యుత్తమ విద్యకు ఆచార్య జూనియర్ కళాశాల అంకితం**

**ఘనంగా మూడవ వార్షికోత్సవ వేడుకలు బి.తులసి రామ్,డైరెక్టర్**







కర్నూలు నవంబర్ 10 విభారె న్యూస్. ప్రతి మనిషి అభివృద్ధికి విద్యార్థి దశ కీలకం అని నగర పాలక సంస్థ కమిషనర్ ఎ.భార్గవ్ తేజ,లక్ష్యం లేకుంటే విజయం దక్కదని లైఫ్ ఢ బిజినెస్ కోచ్ వేణు కళ్యాణ్,అత్యుత్తమ విద్యకు ఆచార్య జూనియర్ కళాశాల అంకితం అని కళాశాల డైరెక్టర్ బి.తులసి రామ్ లు పేర్కొన్నారు.శుక్రవారం నగరంలోని నరసింహారావు పేట,విశ్వక్ గార్డెన్స్ లో ఆచార్య జూనియర్ కాలశాల మూడవ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా డైరెక్టర్ బి.తులసిరామ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.వేడుకలకు నగర పాలక సంస్థ కమిషనర్ ఎ.భార్గవ్ తేజ్,లైఫ్ ఢ బిజినెస్ కోచ్ వేణు కళ్యాణ్ లు హాజరయ్యారు.ముందుగా కమిషనర్ చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.అనంతరం ఆచార్య జూనియర్ కళాశాల అధ్యాపకులకు మోమేంటోలు అందచేశారు.ఈ సందర్భంగా కమిషనర్ ఎ.భార్గవ్ తేజ మాట్లాడారు.ప్రతి వ్యక్తి జీవితంలో విద్యార్థి దశ ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉందన్నారు.ఈ దశలో విద్యతోపాటు క్రమశిక్షణతో ఉన్నత దశకు చేరుకునేలా విద్యార్థులు కృషి చేయాలని సూచించారు.డైరెక్టర్ బి.తులసిరామ్ మాట్లాడుతూ అత్యుత్తమ భోదనతో పాటు,ఐఐటి,మెడికల్ కళాశాలలో సీట్లు సాదించినట్లు పేర్కొన్నారు.భవిష్యత్ లో విద్యార్థులను ఉన్నత స్థానానికి చేరుకునేలా ఆచార్య కళాశాల నిరంతరం కృషి చేస్తుందని ఆయన తెలిపారు.లైఫ్ ఢ బిజినెస్ కోచ్ వేణు కళ్యాణ్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ కు సంబంధించి తల్లి తండ్రులు, ఉపాధ్యాయుల కృషిని విద్యార్థులు గుర్తించాలని అన్నారు.ప్రస్తుతం విద్యార్థులు వీటన్నిటిని మరచి ఎంజాయ్ మెంట్,ప్రేమ పేరుతో తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు.ప్రతి ఒక్కరు లక్ష్యం పెట్టుకుని కష్టపడాలని హితవు పలికారు.వివిధ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను మొమెంటోలు అందజేశారు.అనంతరం విద్యార్థుల కల్చరల్ కార్యక్రమాలు జరిపారు.ఈ వేడుకల్లో ప్రిన్సిపల్స్ ఈశ్వర్, షేక్షావలి,కళాశాల సిబ్బంది,విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

# అలక వీడని బాలినేని....

ఒంగోలు, నవంబర్ 10,మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత బాలినేని శ్రీనివాస్ రెడ్డి షాకింగ్ కామెంట్స్ చేశారు. కనిగిరిబస్సుయాత్రకు రానని, మీ పని మీరు చూసుకుంటే, ఒంగోలులో తన పనేదో తాను చేసుకుంటానని విజయసాయిరెడ్డికి స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. మార్కాపురం టికెట్ ఆశిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి సైతం కనిగిరి పర్యటనకు దూరంగా ఉన్నారు. మార్కాపురంలో వైసీపీ సాధికార బస్సు యాత్రకు ఎంపీ విజయసాయిరెడ్డి, బాలినేని కలిసి ఒకే కారులో వెళ్లారు. శామ్యూల్ జార్జి కళాశాల ఆవరణలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. వచ్చే ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి పోటీచేస్తారని, ఆయన్ను గెలిపించుకోవాలని పార్టీ నేతలకు సూచించారు. రోజంతా కలిసే ఉన్నా తమకు చెప్పకుండా ఏకపక్షంగా నాగార్జునరెడ్డి అభ్యర్థిత్వాన్ని ప్రకటించడంపై బాలినేని శ్రీనివాస్ రెడ్డి, ఇతర నేతలు చిన్నబుచ్చుకున్నారు. ఆ తర్వాత కనిగిరి సభకు వెళ్లేముందు ఎంపీ విజయసాయిరెడ్డి, బాలినేని శ్రీనివాస్ రెడ్డి ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో బాలినేని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఒంగోలులో ఇటీవల నిర్వహించిన సమీక్షల్లో జిల్లా బాధ్యతలు అప్పగిస్తామని చెప్పారని, ఇప్పుడు ఏమీ చెప్పకుండా అభ్యర్థిత్వాన్ని ప్రకటించడం ఏంటని ప్రశ్నించినట్లు సమాచారం. బాలినేని శ్రీనివాస్ రెడ్డి గత నెలలో గన్ మెన్లను ప్రభుత్వానికి సరెండర్ చేస్తున్నట్లు ప్రకటించారు. డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డికి లేఖ రాశారు. కొంతకాలంగా ఒంగోలు పోలీసుల వ్యవహారశైలిపై బాలినేని అసంతృప్తితో రగిలిపోతున్నారు. ప్రకాశం జిల్లాలో నకిలీ భూ దస్తావేజుల కేసులో తీరుపై ఆగ్రహంతో రగిలిపోతున్నారు. పోలీసుల తీరుకు నిరసనగా గన్‌మెన్‌లను ప్రభుత్వానికి తక్షణమే సరెండర్ చేస్తున్నట్లు ప్రకటించారు. నకిలీ భూపత్రాల కేసులో ఇప్పటి వరకు 10 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. అసలు దోషుల తెలిసినా కూడా పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న బాలినేని, తన రాజకీయ జీవితంలో ఇలాంటి పరిస్థితులు ఎన్నడూ చూడలేదని మండిపడ్డారు. నకిలీ భూ దస్తావేజుల కేసులో ఉన్న ఎంతటి వారినైనా అరెస్టు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈ కేసులో అధికార పార్టీ నేతలు ఉన్నా వదిలిపెట్టవద్దని, అరెస్ట్ చేసి తీరాల్సిందేనన్నారు. నాలుగేళ్ల నుంచే ఇలాంటి విచిత్ర పరిస్థితులు చూస్తున్నానన్న బాలినేని, పోలీసులు తన సూచనలను పెడచెవిన పెడుతున్నారని లేఖలో ఆగ్రహం వ్యక్తం చేశారు. నకిలీ భూ దస్తావేజుల కేసులో పోలీసులు సరైన చర్యలు తీసుకోకపోవడం వల్లే తక్షణం, తన గన్‌మెన్‌లను సరెండర్ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ లో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి రీజనల్ కోఆర్డినేటర్ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. వైసీపీ అధిష్టానంపై అసంతృప్తితోనే ఆ బాధ్యతల నుంచి తప్పుకుంటూ కీలక నిర్ణయం తీసుకున్నారు. జగన్ కేబినెట్‌లో మంత్రిగా పని చేసిన బాలినేని శ్రీనివాస్ రెడ్డికి, సీఎం జగన్ చేపట్టిన మంత్రి వర్గ విస్తరణలో రెండవ సారి మంత్రిగా అవకాశం దక్కలేదు. దీంతో అప్పటి నుంచి బాలినేని వైసీపీ అధిష్టానంపై అసంతృప్తితో ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

# ప్రకాశం వైసీపీలో కోల్డ్ వార్

ఒంగోలు, నవంబర్ 10, అసెంబ్లీ ఎన్నికలకు ముందే వైసీపీ లో టికెట్ల వివాదం రాజుకుంటోంది. హైకమాండ్ తమను కాదని మరొకరిని అభ్యర్థులుగా ఖరారు చేయడంతో రగిలిపోతున్నారు. ఇన్నేళ్లు పార్టీ కోసం కష్టపడితే, ఇంకొకరికి సీటు ఇవ్వడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. వైసీపీ నిర్వహిస్తున్న సాధికార బస్సు యాత్ర ప్రకాశం జిల్లాలో పార్టీలో చిచ్చురేపింది. సిట్టింగ్ ఎమ్మెల్యే కుందూరు నాగార్జున రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాలని ఎంపీ విజయసాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డితో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకే వెంకట రెడ్డి ఆగ్రహంతో ఉన్నారు. ప్రకాశం జిల్లా అధ్యక్షుడిగా ఉన్న జంకె వెంకటరెడ్డి, వైసీపీ తరపున మార్కాపురం అసెంబ్లీ సీటు ఆశిస్తున్నారు. తనను కాదని సిట్టింగ్ ఎమ్మెల్యే నాగార్జున గెలిపించుకోవాలని విజయసాయిరెడ్డి చెప్పడంపై రగిలిపోతున్నారు. మార్కాపురం టికెట్ ఆశిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి సైతం కనిగిరి పర్యటనకు దూరంగా ఉన్నారు. మరోసారి నాగార్జునరెడ్డికి మార్కాపురం అసెంబ్లీ సీటు కేటాయించడాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకే వెంకట రెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు తన అనుచరులతో సమావేశమయ్యారు. స్థానిక నేతలతో సంప్రదించకుండా సిట్టింగ్ ఎమ్మెల్యే నాగార్జునరెడ్డిని గెలిపించాలని ఎలా చెబుతారని విజయసాయిరెడ్డిపై అసమ్మతి నేతలు మండిపడ్డారు. జంకె వెంకటరెడ్డితో స్థానిక నేతలు వెన్నా హనుమారెడ్డి, పెద్దిరెడ్డి సూర్యప్రకాశ్ రెడ్డితో పాటు మరికొందరు ముఖ్యనేతలు ఈ సమావేశానికి హాజరయ్యారు. భవిష్యత్ కార్యాచరణపై నేతలతో చర్చిస్తున్నారు జంకె వెంకటరెడ్డి.మార్కాపురంలో వైసీపీ సాధికార బస్సు యాత్రకు ఎంపీ విజయసాయిరెడ్డి, బాలినేని కలిసి ఒకే కారులో వెళ్లారు. శామ్యూల్ జార్జి కళాశాల ఆవరణలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. వచ్చే ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి పోటీచేస్తారని విజయసాయిరెడ్డి వెల్లడించారు. నాగార్జున రెడ్డిని గెలిపించుకోవాలని పార్టీ నేతలకు సూచించారు. రోజంతా కలిసే ఉన్నా తమకు చెప్పకుండా ఏకపక్షంగా నాగార్జునరెడ్డి అభ్యర్థిత్వాన్ని ప్రకటించడంపై బాలినేని శ్రీనివాస్ రెడ్డి, జంకె వెంకటరెడ్డి ఆగ్రహంతో ఉన్నారు. మరోవైపు ఇదే మార్కాపురం సీటు వ్యవహారంపై పార్టీ నేతలు కూడా అసంతృప్తితో ఉన్నారు. రోజంతా కలిసే ఉన్నా తమకు ఒక్క మాటైన చెప్పకపోవడం, ఏకపక్షంగా నాగార్జునరెడ్డి అభ్యర్థిత్వాన్ని ప్రకటించడంపై బాలినేని శ్రీనివాస్ రెడ్డి, ఇతర నేతలు చిన్నబుచ్చుకున్నారు. ఆ తర్వాత కనిగిరి సభకు వెళ్లేముందు ఎంపీ విజయసాయిరెడ్డి, బాలినేని శ్రీనివాస్ రెడ్డి ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో బాలినేని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఒంగోలులో ఇటీవల నిర్వహించిన సమీక్షల్లో జిల్లా బాధ్యతలు అప్పగిస్తామని చెప్పారని, ఇప్పుడు ఏమీ చెప్పకుండా అభ్యర్థిత్వాన్ని ప్రకటించడం ఏంటని ప్రశ్నించినట్లు సమాచారం. నాగార్జునరెడ్డికి అసెంబ్లీ సీటు కేటాయించడంపై బాలినేని శ్రీనివాస్ రెడ్డితోపాటు జంకె వెంకటరెడ్డి తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నారు.

## పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణకాండను తక్షణమే ఆపాలని సిపిఐ డిమాండ్




పెద్దకడుబూరు నవంబర్ 10 ( విభారె న్యూస్) పెద్దకడుబూరు మండలంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో వాల్మీకి సర్కిల్ నందు నిరసన వ్యక్తం చేయడం జరిగింది ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్ సిపిఐ మండల కార్యదర్శి వీరేష్ మాట్లాడుతూ పాలస్తీనా లో జరగబోయే యుద్ధం ఆపాలని ×పాలస్తీనా గజా పై ఇజ్రాయిల్ జరుపుతున్న దాడుల్లో (యుద్ధంలో) వేలాదిమంది అమాయక ప్రజలు చనిపోవడం జరిగింది. యుద్ధం తక్షణమే ఆపాలని కోరుతూ, చనిపోయిన మృతులకు సంతాప సూచికంగా,పాలస్తీనా ప్రజలకు నిరసన కార్యక్రమము చేయడం జరిగింది యుద్ధం వద్దు శాంతియుతంగా సమస్యలు పరిష్కరించుకోవాలని వారన్నారు ఈ కార్యక్రమంలో నరసప్ప రంగస్వామి కదు బూరి బడేసాబు లక్ష్మన్న అర్జున్ తదితరులు పాల్గొన్నారు

## అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం భూముల పరిశీలన

### జిల్లా జాయింట్ కలెక్టర్ నారాపురెడ్డి మౌర్య



పెద్దకడుబూరు నవంబర్ 10 ( విభారె న్యూస్) పెద్దకడబూరు మండలంలోని గవిగట్టు గ్రామ. జిల్లా జాయింట్ కలెక్టర్ నారాపురెడ్డి మౌర్య గవిగట్టు గ్రామ సమీపంలో రైల్వే గేటు వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణము కొరకు సేకరించిన భూములను తహసీల్దార్‌వీరేంద్రగౌడ్‌ఆధ్వర్యంలోపరిశీలించారు. భూములకు సంబంధించిన రికార్డులు సైతం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, మండల సర్వేయర్ తేజస్విని, రైల్వే సిబ్బంది, గ్రామ రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## తొలి స్వాతంత్ర సమరయోధుడు టిప్పు సుల్తాన్ గారి 274 వ జయంతి




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 10–శుక్రవారం స్థానిక అల్ మదద్ కంప్యూటర్ సెంటర్ నందు భారత దేశ తొలి స్వాతంత్ర సమర యోధుడు మైసూర్ పులి షహీద్ టిప్పు సుల్తాన్ గారి 274 వ జయంతి కార్యక్రమము ఘనంగా నిర్వహించారు. అల్ మద థ్ ఫౌండేషన్ చైర్మన్ ఆకుమల్ల రహీమ్ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ సయ్యద్ సలాముల్లా, కో ఆప్షన్ మెంబర్ పడకండ్ల సుబ్రమణ్యం ,మరియు ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ అజీజ్ లు హాజరై విద్యార్థులకు టిప్పు సుల్తాన్ గారి ధైర్య సాహసాలు,దేశ భక్తి గురించి చెబుతూ ఈస్ట్ ఇండియా కంపెనీ వారి నుంచి మన దేశానికి ప్రమాదం జరుగబోతోంది అని గ్రహించి ఈస్ట్ ఇండియా కంపెనీ వారి ని మన దేశంలో రాకుండా అడ్డుకొని పోరాడి వీర మరణం పొందిన గొప్ప జాతీయ సమైక్య వాది అని.ప్రపంచం లోనే మొట్ట మొదటి మిస్సైల్ ను తయారు చేసిన గొప్ప జ్ఞాని అని తెలిపారు. కావున విద్యార్థులందరూ ఇలాంటి గొప్ప స్వాతంత్ర సమర యోధుల జీవితాలను తెలుసుకొని వారిని ఆదర్శంగా తీసుకొని మీరు కూడా దేశాభి వృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు.ఇలాంటి కార్య క్రమాలు నిర్వహిస్తున్న అల్ మద థ్ కంప్యూటర్ సెంటర్ వారిని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం వ్యాస రచన పోటీలో పాల్గొన్న విజేతలకు అతిథుల చేతుల మీదుగా మేమొంటూస్ బహుమతులు అందజేశారు.అతిథులను ఘనంగా సన్మానించారుఈ కార్యక్రమంలోచిన్నవ్యాపారులసంక్షేమ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ గుప్తా, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక సభ్యులు భీస్మా , ముల్లన్ పేట ఉర్దూ స్కూల్ హనీఫ్ సిర్, అల్ మద థ్ కంప్యూటర్ ఫ్యాకల్టీ అబ్దుల్ మజీద్ ,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి





బిగోనెగండ్ల నవంబర్ 10 విభారె న్యూస్ ప్రతినిధి :–ఎమ్మిగనూరు ఎమ్మెల్యే "ఎర్రకోట చెన్నకేశవరెడ్డి" ఆదేశాల మేరకు గోనెగండ్ల మండల పరిధిలోని ఎర్రబాడు సచివాలయం కోడ్ (11390589) లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజా సంక్షేమ, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని మన ప్రియతమ నాయకులు నియోజకవర్గ సీనియర్ నాయకుడు "ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి" పేర్కొన్నారు.బి? గురువారంఎర్రబాడులోఇంటింటికీవెళ్లిప్రభుత్వం వారికి అందిస్తున్న పథకాలను, వాటి ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. ప్రజా సమస్యలు తెలుసుకుని వేంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా "ఎర్రకోట జగనన్న" మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సీఎం జగనన్న సచివాలయ వలంటీర్ వ్యవస్థ లను ప్రారంభించి ప్రజల గుమ్మం వద్దకే ప్రభుత్వ పథకాలను అందిస్తున్నారన్నారు. ఆ ప్రాంత వాసులు ఆయన దృష్టికితీసుకురాగాఆయా సమస్యలను పరిష్కరించాలని సంబందిత అధికారులకుసూచించారు. ప్రస్తుతం అన్ని గ్రామంలో ఎమ్మెల్యే "ఎర్రకోటచెన్నకేశవరెడ్డి"సహకారంతోఅభివృద్ధిపనులు వేగవంతంగా జరుగుతున్నా యని తెలిపారు.?? ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, పార్టీ నాయకులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, మండల యూత్ అధ్యక్షుడు, సింగిల్ విండో ఉపాధ్యక్షుడు, ఏఅూ మండల కన్వీనర్,మండల కన్వీనర్, అధికారులు, కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది, వాలెంటర్లు తదితరులు పాల్గొన్నారు.

## మాదిగల విశ్వరూప మహా సభను జయప్రదం చేయండి

### పోస్టర్లను విడుదల చేసిన ఎమ్మార్పీఎస్ నాయకులు





గోనెగండ్ల నవంబర్ 10 విభారె న్యూస్ ప్రతినిధి :–, గోనెగండ్ల,ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ఈనెల 11 న శనివారం మధ్యాహ్నం 12 గంటలకు హైదరాబాదులోని పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించ తలపెట్టిన "మాదిగల విశ్వరూప మహాసభకు" మాదిగలు, ఉప కులాలు లక్షలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని మాది రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) జిల్లా ఉపాధ్యక్షులు గంజహళ్లి పసేద్దుల మహాదేవ్ మాదిగ పిలుపునిచ్చారు. గురువారం గోనెగండ్ల మండలంలో.. హెచ్. కైరవాడి, గంజహళ్లి వివిధ గ్రామాలలో విస్తృతంగా పర్యటించి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాలలో మాదిగ పేటల్లో మాదిగల విశ్వరూప మహాసభ పోస్టర్లను విడుదల చేశారు. కరపత్రములను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఈ భారీ బహిరంగ సభకు మన భారత ప్రధాని గౌరవనీయులు నరేంద్ర మోడీ గారు ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ సాధించుకునే సమయం ఆసన్నమైందని మాదిగల ఐక్యతను ప్రదర్శిస్తూ ఉద్యోగులు, యువకులు మహిళలు పెద్ద ఎత్తున చలో హైదరాబాద్ కు తరలిరావాలని కోరారు. ఇంటికో మనిషి.. ఊరికో వాహనం తో పెద్ద ఎత్తున బయలుదేరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్. కైరవాడి గ్రామ ఎమ్మార్పీఎస్ నాయకులు కిరణ్ మాదిగ, పెద్దయ్య మాదిగ, శివ మాదిగ, రాముడు మాదిగ, జె. సామిం రాజు మాదిగ,యం.నరసన్న మాదిగ,జె.ఆదామ్ మాదిగ, గంజాహల్లి గ్రామఎమ్మార్పీఎస్ నాయకులుపి.మత్తయ్య మాదిగ,పి.యాకోబు మాదిగ, కె. మాదిగ, పి. జగన్ మాదిగతదితరులుపాల్గొన్నారు.



కౌతాళం మండలం (విభారె న్యూస్ నవంబర్ 10) శ్రీ నరసింహ ఈరన్న స్వామి దేవస్థానము ఉరుకుంద కౌతాళం మండలం కర్నూలు జిల్లా. ఈరోజు దేవస్థాన కార్యాలయం నందు జరిగిన తలనీలాలు ప్రోగు చేసుకునే హక్కు ఒక సంవత్సరకాల పరిమితి బహిరంగ వేలం నందు నలుగురు పాల్గొన్నారు. వారిలో పోటాపోటీ పెరిగి రాజా ఎంటర్ప్రైజెస్ హిందూపూర్ వారు 1.63.80.000/– హెచ్చు పాటదారునిగా నిలిచి ఉన్నారు. దేవస్థాన పాత కార్యాలయ పరిపాలన భవనము పడగొట్టుటకు బహిరంగ వేలం నందు ఐదుగురు పాల్గొన్నారు వారిలో ఇ సురేష్ కుమార్ కర్నూలు వారు 3.44.000/– హెచ్చు పాటదారునిగా నిలిచి ఉన్నారు.

## రాష్ట్రంలో యువతను మోసం చేస్తున్న వైసిపి అధినేత జగన్



పెద్దకడబూరు నవంబర్ 10 ( విభారె న్యూస్) పెద్దకడబూరు మండలం మురువణి గ్రామంలో బాబు ష్యూరిటి భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి రాష్ట్రంలో ఉపాధి ఉద్యోగాలలో యువతను వైసిపి అధినేత జగన్ ఇంటికి పంపిద్దామని మంత్రాలయం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ బాధ్యులు పాలకుర్తి తిక్కా రెడ్డి తనయుడు తెలుగు యువత కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి అన్నారు వారు పెద్దకడబూరు మండలం మురువణి గ్రామంలో బాబు ష్యూరిటి భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికి తిరుగుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలకు ఇస్తున్న సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు వివరించారు ప్రజల కోసం పనిచేసే పార్టీ తెలుగుదేశం పార్టీని అధికారంలోకి రావడానికి మీ అమూల్యమైన ఓటు తెలుగుదేశానికి వేసి గెలిపించాలని మంత్రాలయం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పాలకుర్తి తిక్కారెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు ఈ కార్యక్రమంలో సత్యన్న గౌడ్,లారిల రంగన్న, చంటోడు, ఎంపీటీసీ సభ్యులు జాన్, సురేష్, యోహాన్, చెన్నకేశవులు, దస్తగిరి, నరసయ్య, తెలుగు యువత చెన్నకేశవ, వీరేష్ తదితరులు పాల్గొన్నారు

## గోవుల సంరక్షణ చేసే వారికే అప్పగింత

### ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి..



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 10–.నంద్యాల పట్టణంలో గత కొన్ని నెలలుగా రోడ్లపై అడ్డంగా ఉంటున్న గోవులతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు, ప్రమాదాల బారిన పడడం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో గోవులను వాటి యజమానులు తీసుకెళ్లాలని మున్సిపల్ కమిషనర్, పోలీసు అధికారుల సమక్షంలో పలుమార్లు గోవుల యజమానులతో సమావేశం నిర్వహించి పరిస్థితిని తెలియజేసి హెచ్చరికలు చేయడం జరిగింది. అయితే ఆయా గోవుల యజమానులు కొందరు గోవులను తీసుకువెళ్లి వారి సంరక్షణలో ఉంచుకోవడం జరిగింది. అయినా కూడా దాదాపుగా 100కు పైగా గోవులను, గోవుల యజమానులు తీసుకువెళ్లకపోవడంతో మున్సిపల్ కమిషనర్ రవిచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో తాత్కాలిక గోశాల ఏర్పాటుచేసి వాటి బాధ్యతను దాతల సహకారంతో చేపట్టడం జరిగింది. వీటిని గోషాలకు తరలిస్తున్నామని ప్రభుత్వ నిబంధనల మేరకు వాటిని సంరక్షిస్తామని కమిషనర్ వెల్లడించారు. ఈ నేపథ్యంలో నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి గోవులను సంరక్షించే బాధ్యతను, వాటిపై ఆసక్తి ఉన్న వారికి అప్పజెప్పాలన్న మంచి సంకల్పంతో బండి ఆత్మకూర్ మండలంలోని నెమళ్ళకుంట, నారపురెడ్డికుంట, నాయుని చెరువు గ్రామాలలో ఉన్న వారికి గోవుల సంరక్షణ బాధ్యతను అప్పగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి మాట్లాడుతూ... నంద్యాల పట్టణంలో గోవులు రోడ్లపై ఉంటూ ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులను కలిగిస్తూ ప్రమాదాలకు కారణం అవుతూ, అవి కూడా ప్రమాదాలకు గురవుతున్నాయని తెలిపారు. అలాగే గోవులు వాటి ఆహారం కోసం ప్లాస్టిక్ మరియు ప్రాణాంతకమైన ఆహార పదార్థాలను తిని మృతి చెందడం, రోగాల బారిన పడటం ఎంతో బాధగా వుంటుందన్నారు. అయితే ఈ గోవులను సంరక్షించాలని సంకల్పంతో మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో గోవుల సంరక్షణను చేపట్టి వాటిని ఆసక్తిగల వారికి అప్పజెప్పి సంరక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా కోరడం జరిగిందన్నారు. ఇందులో భాగంగానే బండి ఆత్మకూరు మండలం, మహానంది మండలాలను ఎంపిక చేసుకోవడం జరిగిందని తెలిపారు. నెమ్మలకుంట, నారాపురెడ్డి కుంట నాయునిచెరువు గ్రామాలలోని వారికి గోవులను లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేసి వారికి అప్ప చెప్పడం జరిగిందన్నారు. భవిష్యత్తులో ఎక్కడైనా గోవుల యజమానుల సంరక్షణలో లేని వాటిని తమకు అప్పజెప్పాలని వాటిని ఆసక్తి గల వారికి అప్పజెప్పి వాటిని సంరక్షిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇషాక్ భాషా, సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ సభ్యులు మరియు మార్కెట్ యార్డ్ చైర్మన్ మహేశ్వరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవిచంద్ర రెడ్డి హెల్త్ ఆఫీసర్ అంకిరెడ్డి. శానిటేషన్ సూపరైజర్ లక్ష్మినారాయణ. శివ ప్రసాద్ రెడ్డి , దేశం సుధాకర్ రెడ్డి, నంద్యాల మూడవ పట్టణ అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్, శంకర్ రెడ్డి ,నాగ నంద రెడ్డి, బాల ఉసేని, మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు

## ఘనంగా ప్రపంచ సైన్స్ దినోత్సవం...






విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:– నవంబర్ 10 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాతపేట డోన్ నందు ప్రపంచ సైన్స్ దినోత్సవం సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో 8,9,10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు చెకుముకి టాలెంట్ పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూఢనమ్మకాలను నమ్మరాదని, ప్రతి ఒక్కరూ గుర్తించి, సైన్స్ అంటే జీవిత భాగస్వామి గా అవగాహన కలిగి ఉండాలని కోరారు. సైద్ధాంతిక మరియు భౌతిక, విజ్ఞాన శాస్త్ర అంశాలను పరిగణనలోకి తీసుకొని ముందుకెళితే మానవ జీవితం సుఖమయం అవుతుందన్నారు. సామాజిక పురోగతి జరగాలంటే సైన్స్ పట్ల నమ్మకం ఉండాలన్నారు. అలాగే పాఠశాల విద్యార్థులు ఎవ్వరు కూడా పొగాకు ఉత్పత్తులను వాడటం నేరమని, వాటి వాడకం వల్ల ఆరోగ్యం పాడవుతుందని, కాలేయం దెబ్బతినడం వల్ల జీర్ణవ్యవస్థ పనితీరు మందగించి, రోగాలు పాలవుతారని తెలిపారు. ఈకార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, వెంకట రమణ, వెంకట లక్ష్మీ, రఘునాథ్ ఎస్తేరమ్మ,రవిశేఖర్, సుబ్బారాయుడు, శ్రీనివాసులు, లక్ష్మయ్య,అనంత శ్రీనివాసులు, లక్ష్మి కాంతరెడ్డి,రాధ, అల్లిపీరా, భూకాంతరెడ్డి, మద్దిలేటి, విజయకుమార్, సుబాన్, జయసుబ్బారాయుడు, శివన్న, ఆదినారాయణ, సురేష్, మధుసూదన్ రెడ్డి, లీలావతమ్మ, సంజీవరెడ్డి, రమేష్, దేవేంద్రప్ప, భాను ప్రకాష్ రెడ్డి, భారతి, లక్ష్మీ ప్రభావతి, హుస్సేన్ భాను, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**